నమస్తే తెలంగాణ
# వికారాబాద్
11 | హైదరాబాద్, ఆదివారం 14 జనవరి 2024 | VIKARABAD


రంగారెడ్డి జిల్లా కడ్తాల్‌లోని భూనీలాసహిత లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో శనివారం గోదాదేవి, రంగనాథస్వామి వారి కల్యాణోత్సవం సందర్భంగా ముస్తాబైన దేవతా మూర్తులు



# పల్లెలకు సంక్రాంతి

## నేటి నుంచి మూడు రోజుల పాటు పండుగ

### పిండి వంటల ఘుమఘుమలు.. ఊరూరా క్రీడోత్సవాలు



గ్రామాలకు సంక్రాంతి కళ వచ్చింది. ఇండ్ల ముందు రంగు రంగుల ముగ్గులు, గంగిరెద్దుల విన్యాసాలు, బుడబుక్కల వారు, హరిదాసుల కీర్తనలు, చిన్నారుల పతంగుల ఎగురవేత, యువత ఆటల పోటీలు, మహిళలు పిండి వంటలు చేయడం వంటి పనులతో గ్రామాల్లో పండుగ కళ ఉట్టిపడుతున్నది. బంధువులు, ఆడపడుచుల రాకతో ఇండ్లు సందడిగా మారాయి. మూడు రోజుల సంక్రాంతి పండుగను జిల్లా ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకోవడానికి సిద్ధమయ్యారు.

-పెద్దఅంబర్‌పేట/బొంరాస్‌పేట, జనవరి 13


ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

హిందువులు జరుపుకొనే పెద్ద పండుగలలో ప్రధానమైనది సంక్రాంతి ఒకటి. సూర్యుడు ధనుస్సు రాశి నుంచి మకర రాశిలోకి ప్రవేశించే సమయంలో మకర సంక్రాంతి పండుగను జరుపుకొంటారు. రైతులు పండించిన పంటలు చేతికొచ్చిన వేళ ఈ పండుగను మూడు రోజుల పాటు ఉత్సాహంగా జరుపుకొంటారు. ఆదివారం భోగి, సోమవారం సంక్రాంతి, మంగళవారం కనుమ పండుగను చేసుకోనున్నారు.

సంక్రాంతి పండుగకు ఊరూవాడ పోటీలు నిర్వహిస్తున్నారు. కొందరు ఇప్పటికే ఆయా ఊర్ల పేర్లతో క్రికెట్ ప్రీమియర్ లీగ్‌లు మొదలుపెట్టారు. మరికొందరు పండుగ సెలవులు మొదలుకాగానే పోటీల నిర్వహణ కోసం సర్వం సిద్ధం చేసుకున్నారు. ఇందుకోసం నిర్వాహకులు పెద్ద ఎత్తున ఏర్పాట్లుచేస్తున్నారు. దాతల సహకారంతో పోటీలను విజయవంతం చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. ఐపీఎల్ (ఇండియన్ ప్రీమియర్‌లీగ్) తరహా ఇటీవల ప్రతిచోట ఆ ఊరి పేరుతో ప్రీమియర్ లీగ్‌లు నిర్వహిస్తున్నారు. ఒక్కో ఊరిలో కనీసం నాలుగైదు జట్లు ఉండేలా ప్లాన్ చేస్తున్నారు. కాలనీల్లో బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. ఆయా కాలనీల అసోసియేషన్లు ఇందుకోసం ఏర్పాట్లు చేస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో కబడ్డీ, వాలీబాల్ పోటీలు సైతం నిర్వహిస్తున్నారు.

**చుక్కలు వేసి.. రంగులు అద్ది**

సంక్రాంతి పండుగ సమయంలో గ్రామాలతోపాటు కాలనీల్లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నారు. బోగి పండుగకు ముందు రోజు చాలాచోట్ల పోటీల నిర్వహణ కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో డప్పు చాటింపు వేయించారు. కాలనీల్లో అసోసియేషన్ సభ్యులు పోటీల గురించి ప్రచారం నిర్వహిస్తున్నారు. అందరూ పాల్గొనేలా ఒక్కొక్కరిని కలుస్తున్నారు.



సంబురంగా పోటీలు నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నారు. పోటీల్లో గెలుపొందినవారికి బహుమతులు అందజేస్తున్నారు. ఒక్కచోటకు చేరడం వల్ల సంబంధాలు మరింత మెరుగవుతాయని, కష్ట సుఖాలు పంచుకునేందుకు సమయమూ దొరుకుతుందని అసోసియేషన్ల ప్రతినిధులు పేర్కొంటున్నారు. కాలనీల్లో నెలకొంటున్న సమస్యలు, ఇతర అంశాలపై కూడా ఇవి చర్చా వేదికలుగా మారుతున్నాయని అంటున్నారు.









# స్వీట్ అండ్ కలర్ ఫుల్

పరేడ్ గ్రౌండ్‌లో అంతర్జాతీయ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ శనివారం కలర్ ఫుల్‌గా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ ఫెస్టివల్‌లో వివిధ రకాల ఫుడ్ కోర్టులు, హస్తకళలు, చేనేత వస్త్రాల స్టాళ్లు ఏర్పాటు చేశారు. నింగిని తాకేలా.. ఎగిరిన విభిన్న ఆకృతుల గాలిపటాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

# కోళ్ల పందెం.. రెడీ

### శివారుల్లో గుట్టు చప్పుడుకాకుండా ఏర్పాట్లు.. నిఘా పెంచిన పోలీసులు

ప్రతి ఏడాది సంక్రాంతి పండుగకు నగర శివారుల్లో గుట్టుగా కోడి పందాలు నిర్వహించడం.. పోలీసులు దాడి చేసి నిర్వాహకులను అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేయడం జరుగుతూనే ఉన్నది. దీన్ని దృష్టిలో ఉంచుకున్న పోలీసులు ఈసారి కోడి పందాల నిర్వహణకు ఆదిలోనే అడ్డుకట్ట వేసే పనిలో నిమగ్నమయ్యారు. గస్తీ పెంచి ఏర్పాట్లపై గట్టి నిఘా ఏర్పాటు చేశారు. అయినా నిర్వాహకులు కోడి పందాల నిర్వహణకు సీక్రెట్‌గా అన్ని ఏర్పాట్లు చేసుకుంటూ పోలీసులకు సవాలు విసురుతున్నారు.

-ఇబ్రహీంపట్నం, జనవరి 13



సంక్రాంతిని పురస్కరించుకొని నగర శివారులో కోడి పందాల నిర్వహణకు గుట్టుచప్పుడు కాకుండా ఏర్పాట్లు జరుగుతున్నాయి. పందెం రాయుళ్లు మూడోకంటికి తెలువకుండా సర్వం సిద్ధం చేస్తున్నారు. ముఖ్యంగా ఇటుకబట్టీల యజమానులతో పాటు అక్కడ పనిచేసే ఆంధ్రప్రదేశ్ రాష్ర్టానికి చెందిన చెందిన అనేకమంది ఈ పందాలలో పాలుపంచుకుంటున్నారు. పందెం రాయుళ్లు ఇప్పటికే కోడి పుంజులను పెంచి పోరుకు సిద్ధంగా ఉంచారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాల పరిధిలోని పలు గ్రామాల్లో పందెం కోళ్ల పెంపకం పెద్ద ఎత్తున జరుగుతున్నది. ఇతర ప్రాంతాలకూ ఇక్కడినుంచే తరలిస్తున్నారు. ఒక్కో కోడి పుంజును రూ.10వేల నుంచి రూ.30వేల వరకు విక్రయిస్తున్నారు. జిల్లాలోని ఆదిబట్ల, నాదర్‌గుల్, బొంగుళూరు, ఎలిమినేడు, మాదాపూర్, రాగన్నగూడ, మన్నెగూడ, తుర్కయాంజాల్ వంటి శివారు ప్రాంతాల్లో కోడి పందాల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

**పోలీసుల ప్రత్యేక నిఘా..**

గత సంక్రాంతి పండుగ సందర్భంగా శివారు ప్రాంతాల్లో అనేకమంది కోడిపందాలు నిర్వహిస్తూ పటుబడ్డారు. ఈ నేపథ్యంలో ఈ సారి పోలీసులు గట్టి నిఘాను ఏర్పాటు చేశారు. ఎస్‌వోటీ పోలీసులు సైతం రంగంలోకి దిగారు. ఇటీవలే నాదర్‌గుల్, కుర్మల్‌గూడ, మన్నెగూడ, తుర్కయాంజాల్, ఎలిమినేడు, మాదాపూర్ తదితర గ్రామాల్లో కోళ్ల పందాల నిర్వాహకులపై ఎస్ఓటీ పోలీసులు దాడులు చేసి కేసులు నమోదు చేశారు. గతంలో పట్టుబడ్డవారి కదలికలపై సైతం దృష్టి సారించారు. అయినప్పటికీ పందెం రాయుళ్లు రాత్రి పూట గుట్టుచప్పుడు కాకుండా కోడిపందాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు.

**కఠిన చర్యలు తప్పవు..**



కోడిపందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. నగరశివారుల్లో ఇప్పటికే నిఘాను పెంచాం. గతంలో పట్టుబడ్డ నిర్వాహకులపై కూడా ప్రత్యేక దృష్టి సారించాం. నిర్వాహకులు ఎవరైనా ఉంటే తమ ప్రయత్నాలు మానుకోవాలి.

- శ్రీనివాస్‌రావు, ఏసీపీ ఇబ్రహీంపట్నం



# అదుపుతప్పిన ఆర్టీసీ బస్సు

### అనంతగిరి ఘాట్ రోడ్డు వద్ద ఘటన
### డ్రైవర్ చాకచక్యంతో ప్రయాణికులకు తప్పిన ప్రమాదం
### స్వల్ప గాయాలైన ప్రయాణికులను 108లో దవాఖానకు తరలింపు

వికారాబాద్, జనవరి 13 : తాండూరు ఆర్టీసి డిపోకు చెందిన బస్సు ప్రయాణికులతో వస్తూ అనంతగిరి ఘాట్ వద్ద అదుపు తప్పింది. బస్సు డ్రైవర్ చాకచర్యంతో ప్రయాణికులకు పెద్ద ప్రమాదం తప్పింది. ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం.. తాండూరు ఆర్టీసీ డిపోకు చెందిన టీఎస్34టీఏ6363 నెంబర్ గల బస్సు శనివారం హైదరాబాద్, వికారాబాద్ మీదుగా తాండూరు వెళ్తున్నది. మధ్యాహ్నం 92 మంది ప్రయాణికులతో ప్రయాణిస్తున్న బస్సు వికారాబాద్ అనంతగిరి ఘాట్ రోడ్డు వద్ద బ్రేకులు ఫెయిలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ రఫీ చాకచక్యంతో ప్రయాణికులను కాపాడేందుకు బస్సును రోడ్డు దింపి పొదల్లోకి తీసుకెళ్లి నిలిపాడు. దీంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. గాయపడ్డ వారిని 108లో వికారాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మొత్తం 9 మంది గాయపడగా, ఐదుగురికి స్వల్పగాయాలు అయ్యాయి. మిగతా నలుగురు దవాఖానలో ఉండి చికిత్స పొందుతున్నారు. ప్రయాణికులను వేరే బస్సులలో గమ్యస్థానాలకు చేర్చారు.

# కరెంటు తీగలతో జాగ్రత్త

### బహిరంగ ప్రదేశాల్లోనే పతంగులు ఎగురవేయాలి

సిటీబ్యూరో, జనవరి 13 (నమస్తే తెలంగాణ): సంక్రాంతి పండుగ రోజు పతంగులు ఎగురవేసే సమయంలో ప్రజలు సురక్షిత ప్రాంతాలను ఎంచుకోవాలని, విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద గాలిపటాలను ఎగురవేయవద్దని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ సూచించారు. మాంజాలు విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లపై పడి ప్రమాదాలు, విద్యుత్ అంతరాయాలు కలిగే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా పట్టణాల్లో పతంగులు ఎగురవేసే వారు ప్రత్యేకంగా జాగ్రత్తలు తీసుకోవాలంటూ.. పలు సూచనలు ఇచ్చారు.

- విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా బహిరంగ ప్రదేశాల్లో, మైదానాల్లో మాత్రమే గాలిపటాలు ఎగురవేయాలి.
- కరెంటు లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్ల వద్ద పతంగులు ఎగురవేయడం ప్రమాదకరం. ఒక వేళ పతంగులు కానీ, మాంజాలు కానీ విద్యుత్ లైన్లపై ఇతర పరికరాలపై పడితే సరఫరాలో అంతరాయంతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.
- కాటన్, నైలాన్, లెనిన్‌తో చేసిన మాంజాలను మాత్రమే వాడండి. మెటాలిక్ మాంజాలు వాడొద్దు. మెటాలిక్ మాంజాలు విద్యుత్ వాహకాలు.. అవి లైన్లపై పడితే షాక్ కొట్టే అవకాశం ఉంది.
- బాల్కనీ, గోడల మీద నుంచి పతంగులు ఎగురవేయరాదు. ఇది చాలా ప్రమాదకరం.
- విద్యుత్ పరికరాలు, తీగలపై పతంగులు, మాంజాలు పడినా.. వైర్లు రోడ్డుపై పడినా.. తాకకుండా విద్యుత్ శాఖ నం. 1912కి లేదా సమీప విద్యుత్ కార్యాలయానికి, యాప్ లేదా వైబ్ సైట్ (www.tssouthernpower.com) కు సమాచారం అందించాలి.


టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ

# నుమాయిష్..హౌస్‌ఫుల్



అబిడ్స్, జనవరి 13: నుమాయిష్ సందర్శకులతో కిటకిటలాడుతున్నది. సంక్రాంతి సెలవులతో రద్దీ మరింత పెరిగింది.ఎగ్జిబిషన్ ట్రెయిన్‌లో జర్నీ చేస్తూ. సందడి చేస్తున్నారు నగరవాసులు. స్టాళ్లను పరిశీలించి.. నచ్చిన వస్తువులను కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటి వరకు ఎగ్జిబిషన్‌ను దాదాపు మూడు లక్షలకు పైగా సందర్శించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు వనం సత్యేందర్, కార్యదర్శి హనుమంతరావు, కోశాధికారి రాజేందర్‌కుమార్ తెలిపారు.



# సంక్రాంతి వచ్చిందే తుమ్మెదా..

కొండాపూర్, జనవరి 13 : మాదాపూర్‌లోని శిల్పారామంలో సంక్రాంతి సంబురాల్లో భాగంగా శనివారం గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసులు, బుడబుక్కలు, జంగమదేవరులు, కొమ్మదాసరులు, సోదమ్మ, పిట్టల దొరల వంటి జానపద కళారూపాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. అనంతరం విదూషి అపర్ణ శంకర్, సుష్మిత శిష్య బృందాలు ప్రదర్శించిన నృత్యరూపకాలు అలరించాయి. ఆదివారం భోగి పళ్ల ఉత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.